ఏరులై పారుతున్న సారా

- కుటీర పరిశ్రమలను తలపిస్తున్న వైనం
- రాత్రివేళల్లో అక్రమ రవాణా
- పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు


గోకవరం మండలంలో నిర్వహిస్తున్న సారా బట్టీ (ఫైల్)

గోకవరం: మెట్ట ప్రాంతం గోకవరం మండలంలో సారా ఏరులై పారుతుంది. మద్యం ధరలకు రెక్కలు రావడంతో పేద, మధ్య తరగతికి చెందిన మద్యం బానిసలు సారాను ఆశ్రయిస్తున్నారు. యువకులు సైతం ఈ కల్తి సారాను సేవించి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. మండలంలో ఇటీవల కాలంలో సారా తయారీ, అమ్మకాలు జోరందుకున్నాయి. కొందరు సారా వ్యాపారస్తులు కుటీర పరిశ్రమలుగా చేపట్టారు.

ఇదీ సంగతి

సారా వ్యాపారంలో పెట్టుబడి తక్కువ.. లాభాలు ఎక్కువ. కష్టం కూడా తక్కువగా ఉండడంతో ఈ వ్యాపారాన్నే అనేక మంది వృత్తిగా మలచుకుంటున్నారు. మొత్తంగా గోకవరం ఏజెన్సీలో సారా వ్యాపారం మూడు పూలు.. ఆరుకాయలు అన్నచందంగా మారింది. మండల కేంద్రంలోనే యథేచ్ఛగా సారా విక్రయాలు జరుగుతున్నాయంటే.. ఇక మారుమూల గిరిజన గ్రామాల్లో పరిస్థితి ఇంకెలా ఉంటుందో ఊహించుకోవచ్చు.

ఏజెన్సీ ముఖకేంద్రంగా

ముఖ్యంగా అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉన్న మల్లవరం, గంగవరం, ఠాకూరుపాలెం, కామరాజుపేట గ్రామాలు, నిత్యం కాలువలు ప్రవహించే తంటికొండ, గడెలపాలెం, ఇటికాయలపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో సారా తయారీ ఎక్కువగా జరుగుతుంది. అటవీప్రాంతం, కాలువ గట్ల వెంబటి సారా వ్యాపారస్తులు బట్టీలు నిర్వహించి సారాను తయారు చేస్తున్నారు. మండలంలో రోజుకు సుమారు 10 వేల లీటర్ల సారా తయారీ జరుగుతుందని అంచనా. ఇలా తయారైన సారా రాత్రి సమయంలో మండలంలో వివిధ గ్రామాలకు, ఇతర మండలాలకు రవాణా అవుతుంది. సమీప మండలాలైన దేవీపట్నం, గంగవరం, రంపచోడవరంల నుంచి ప్రతీరోజు మండలానికి సారా ఎగుమతి అవుతుంది.

బలవుతున్న గిరిజనులు

సారా రవాణాను ఎక్కువగా పేదరికంలో ఉన్న మహిళలు, యువకులే సాగిస్తున్నారు. పేదరికంలో ఉన్న వీరికి అధిక డబ్బులు ఆశచూపి వ్యాపారస్తులు ఈ ఉచ్చులోకి లాగుతున్నారు. ఒకవేళ పోలీసులకు దొరికిపోయినా ఈ అమాయకులే జైలుకి వెళ్లి తమ భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారు.

పుట్టగొడుగుల్లా వెలుస్తున్న బట్టీలు

ఒక్కొక్క గ్రామంలో సుమారు ఏడు, ఎనిమిది సారా దుకాణాలు ఉన్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా ఈ దుకాణాలలో సారా లభిస్తుంది. సారాను అరికట్టాల్సిన ఎక్సైజ్ శాఖాధికారులు దీనిని పట్టించుకోకపోవడం వలనే మండలంలో సారా ఏరులై పారుతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో పదుల సంఖ్యలో సారా దుకాణాలు ఉన్నా అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారన్నారు. సమాచారం ఇచ్చినా కేవలం మొక్కుబడి దాడులు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండలంలో సారా తయారీ, అమ్మకాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. గోకవరం ఎస్సై పవన్‌కుమార్‌ని సంప్రదించగా మండలంలో సారా తరలిస్తున్న, అమ్మకాలు సాగిస్తున్న వారిపై తరచూ దాడులు చేసి అరెస్టు చేస్తున్నామన్నారు. ప్రజలు తమకు సహకరించి సమాచారం అందించాలని కోరారు.

నేడు ఒలింపిక్ రన్

తుని: కాకినాడ జిల్లా పరిధిలోని 8 కేంద్రాల్లో సోమవారం ఒలింపిక్ రన్ నిర్వహిస్తున్నామని జిల్లా ఒలింపిక్ సంఘం చైర్మన్ చుండ్రు గోవిందరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 1894లో ఏథెన్స్ నగరంలో ఒలింపిక్స్ ప్రారంభమైన సందర్భంగా ఏటా ఒలింపిక్ రన్ జరుపుతున్నామన్నారు. కాకినాడ, పిఠాపురం, అన్నవరం, తుని, జగ్గంపేట, కరప, సామర్లకోట, యు.కొత్తపల్లిలో ఉదయం 8.గంటలకు రన్ ప్రారంభమవుతుందన్నారు. జిల్లాలోని అంతర్జాతీయ, జాతీయ క్రీడాకారులు, స్కూల్, కళాశాల విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఒలింపిక్ రన్‌లో పాల్గొన్న అందరికి జిల్లా సంఘం తరపున ప్రశంసా పత్రాలను అందచేస్తామన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు విద్యుత్ శాఖ పరిధిలోని ఒమ్మంగి 11కేవీ ఫీడర్‌లోని రెండు గ్రామాలకు రానున్న రెండు రోజుల పాటు విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్టు జగ్గంపేట విద్యుత్ శాఖ ఈఈ బి వీరభద్రరావు ఆదివారం ఓ ప్రకటలో తెలిపారు. ఈ నెల 23 నుంచి 24 వరకు ఉదయం 9.గంటల నుంచి మధ్యాహ్నం 2.గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నామన్నారు. ఒమ్మంగి ఫీడర్‌లో కొత్త లైన్లు పునరుద్ధరించే పనులు నిమిత్తం ఒమ్మంగి, రాచపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ ఈఈ వీరభద్రరావు కోరారు.

క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత


విలేకరి శ్రీనివాస్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న మురళీకృష్ణంరాజు

ఏలేశ్వరం: వైఎస్సార్ సీపీ నర్సాపురం పార్లమెంట్ పరిశీలకుడు ముదునూరి మురళీ కృష్ణంరాజు మరోసారి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన విలేకరి దొడ్డి శ్రీనివాస్ ఇటీవల ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకుని ఆదివారం ఆయనను పరామర్శించి రూ.10వేలు ఆర్థికసహాయం అందజేశారు. ఆయన వెంట బొల్లు నాగేశ్వరరావు, పోకనాటి వెంకటేశ్వరరావు, నల్లా వెంకటేశ్వరరావు, కోలా సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మధుమేహంతో అవయవాలపై ప్రభావం

తుని రూరల్: అన్నవరం గ్రామం తేటగుంట రామాలయంలో సత్యసింహ ఆస్పటల్స్ వైద్యురాలు డాక్టర్ చిత్రారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 200 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి నిర్వహకులు ఉచితంగా మందులను అందించారు.అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ శరీరంలోకి మధుమేహం ప్రవేశించకుండ జాగ్రత్తలు పాటించాలని, మధుమేహగ్రస్తులు ఆహార నియమాలు పాటించడంతో వ్యాధిని అదుపులో ఉంచుకోవాలని, దాని తీవ్రత పెరిగితే ఇతర అవయవాలపై ప్రభావం చూపుతుందన్నారు. జాగ్రత్తలు పాటించాలన్నారు.

నివురుగప్పిన కవిత్వం


కవి సత్య వరప్రసాద్‌ను సత్కరిస్తున్న శ్రీ కళావేదిక ప్రతినిధులు

తుని: కాకినాడ పీ.ఆర్.కళాశాలలో శ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జాతీయ ద్విశత కవి సమ్మేళనంలో తునికి చెందిన కవి, తెలుగు పండితులు ఈరంకి వీరవెంకట సత్యవరప్రసాద్ తన కవిత్వంతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఆయన వినిపించిన నివురుగప్పిన నిప్పు–సత్యం అనే వచన కవితకు నిర్వాహకులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆయనకు ప్రశంసా పత్రం, శాలువతో శ్రీ కళావేదిక సభ్యులు సన్మానించారు.

ఎమ్మెల్యేకు రైతుల వినతి


సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే సత్యప్రభను కోరుతున్న రైతులు

ప్రత్తిపాడు: మండలంలోని పెదశంకర్లపూడి గ్రామంలోని ఆయకట్టుకు సమృద్ధిగా సాగు నీటి జలాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ రైతులు కోరుతున్నారు. ఈ మేరకు ఆదివారం పెదశంకర్లపూడి విచ్చేసిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభను రైతులు సాగునీటి సమస్యలు పరిష్కరించాలని కోరారు. గ్రామంలోని సాగునీటి చెరువులు, పంట కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టకపోవడంతో చెరువుల్లో నీటి నిల్వలు తగ్గిపోయాయని, సాగునీటి పారుదలకు అనుగుణంగా పంటకాలువలు లేవని రైతులు తెలిపారు. ఈ సందర్భంగా వినతి పత్రాన్ని స్వీకరించి వెంటనే ఆయకట్టు భూములకు నీరందెలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే సత్యప్రభ రైతులకు హామీ ఇచ్చారు.

సంపూర్ణ గీతాపారాయణ

బోట్‌క్లబ్: స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం సంపూర్ణ గీతాపారాయణ నిర్వహించారు. ఆలయ సేవా సమితి సభ్యులు, ఆలయ అర్చకులు, శ్రీకృష్ణ పరిపార సమితి సభ్యులు ఈ గీతా పారాయణలో పాల్గొన్నారు.

30న కాకినాడలో పూరీ జగన్నాథుడి రథయాత్ర

బోట్‌క్లబ్: ఇస్కాన్ కాకినాడ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీన కాకినాడ నగరంలో అంగరంగ వైభవంగా పూరీ జగన్నాథుడి రథయాత్ర నిర్వహిస్తున్నట్టు ఇస్కాన్‌శాఖ బాధ్యులు అనంత శేషదాస్ తెలియజేశారు. ఆ రోజు మధ్యాహ్నం 3 గంటలకు మధురా నగర్‌లోని గోకులం ప్రాంగణం నుంచి ప్రారంభమయ్యే రథయాత్ర మెహర్‌నగర్, భానుగుడి సెంటర్, మెయిన్‌రోడ్డు, గోల్డ్ మార్కెట్ సెంటర్, సినిమా రోడ్డు మీదుగా సూర్య కళామందిరానికి చేరుకుంటుందన్నారు. సూర్య కళామందిరంలో రాత్రి జరిగే కార్యక్రమంలో పూరి జగన్నాథుడి వైభవంపై రాజమహేంద్రవరం ఇస్కాన్ బాధ్యులు సత్యగోపీనాథ్ ప్రవచనం ఉంటుందన్నారు. ఈ రథయాత్రలో భక్తులందరూ పాల్గొనాలన్నారు.

పొంచి ఉన్న ముప్పు


రహదారిని ఆనుకుని తవ్విన గొయ్యి

ఏలేశ్వరం: పట్టణంలోని స్థానిక సాయిబాబా మెట్ట మీద ఉన్న వాటర్ ట్యాంక్ నుంచి వస్తున్న ప్రధాన పైపుకు రంధ్రం పడింది. దీనితో స్థానిక ఏలేరు ప్రాజెక్టు కార్యాలయం, ఆంజనేయస్వామి ఆలయం వద్ద రహదారిని ఆనుకొని మున్సిపల్ సిబ్బంది గొయ్యి తీశారు. రోజులు గడుస్తున్నా పైపుకు మరమ్మతులు చేయకపోగా తాగునీరు వృథాగా పోతుంది. నిత్యం వాహనాలు, పాదచారులు రాకపోకలు సాగించే రహదారిని ఆనుకుని గొయ్యి ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టి గొయ్యిని పూడ్చాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

26 నుంచి ఆషాఢ మాసోత్సవం

- ఉత్సవాలకు భారీగా ఏర్పాట్లు
- 4 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా

తుని రూరల్: ఉత్తరాంధ్ర భక్తుల ఆరాధ్యదైవం తలుపులమ్మ అమ్మవారి ఆషాఢ మాసోత్సవాలు ఈ నెల 26 నుంచి జూలై 24 వరకు లోవ దేవస్థానంలో వైభవోపేతంగా నిర్వహించనున్నట్టు డిప్యూటీ కమీషనర్, కార్యనిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాధరాజు ఆదివారం తెలిపారు. గంధామావాస్యకు లోవకొత్తూరు గ్రామంలో అమ్మవారి పుట్టింట సంబరాలు, ఆషాడం మాసంలో లోవ దేవస్థానంలో మాసోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఆషాఢ మాసోత్సవాలను పురస్కరించుకుని పర్వదినాలలో ప్రత్యేక పూజలు, అమ్మవారికి విశేష అలంకరణలు చేస్తామన్నారు. ఉత్సవాలు సందర్భంగా వేలాదిగా తరలివచ్చే భక్తులకు తాగునీరు, ఉచిత వైద్య సదుపాయాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. నాలుగు లక్షల మంది భక్తులు ప్రత్యేక వాహనాల్లో వచ్చే అవకాశం ఉన్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండ పెద్దాపురం డీఎస్పీ పర్యవేక్షణలో తుని రూరల్ సీఐ, ఎస్సైల ఆధ్వర్యంలో భారీగా పోలీసుల, ప్రైవేట్ సెక్యూరిటీతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. శ్రీవారి భక్తుల సేవలను ఉపయోగించుకుంటామన్నారు.

పూజలు, అలంకరణలు

ఆషాఢ మాసోత్సవాల సందర్భంగా లోవ దేవస్థానంలో అమ్మవారికి విశేష పూజలు, అలంకరణలు చేయనున్నట్టు ఈఓ తెలిపారు. 29న మొదటి ఆదివారం మట్టి గాజులతో అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు. జూలై ఐదున అమ్మవారి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రం సందర్భంగా అమ్మవారికి విశేషంగా పంచామృతాభిషేకాలు చేస్తామన్నారు. 6న శుద్ధ ఏకాదశి పర్వదినం రోజున లక్ష తులసి పూజ, 10న పౌర్ణమి సందర్భంగా మహాచండీ హోమం, 13న వివిధ రకాల కూరగాయలతో అమ్మవారికి శాకాంబరిదేవి అలంకరణ చేస్తామన్నారు. 20న బహుళ ఏకాదశి సందర్భంగా విశేష పూల అలంకరణ, లక్ష బిల్వార్చన జరిపిస్తామన్నారు. జూలై 23న సప్త నదీజలాలతో సహస్ర ఘటాభిషేకానికి అమ్మవారిని అవాహనం, 24న భక్తుల సమక్షంలో వైభవోపేతంగా సహస్ర ఘటాభిషేకం నిర్వహిస్తామని వేలాదిగా భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలన్నారు.


లోవ దేవస్థానంలో వెలసిన తలుపులమ్మ అమ్మవారు

ఇవండీ సంగోతులు


తాళ్లూరు జంక్షన్ సమీపంలో గుంతలతో అవస్థలు పడుతున్న వాహనదారులు


వి.కొత్తూరు కాలనీ వద్ద భారీ గుంతలతో అధ్వానంగా ఉన్న లోవ రోడ్డు

- మూడు రోజుల్లో ఆషాఢ మాసోత్సవాలు
- భారీ గుంతలతో లోవ ఆలయ రహదారి

తుని రూరల్: జాతీయ రహదారిపై లోవ దేవస్థానానికి వెళ్లే రహదారి భారీ గుంతలతో అధ్వానంగా మారింది. వాహనాలు ఎప్పుడు బోల్తా కొడతాయో తెలియక డ్రైవర్లు, వాహనచోదుకులు బెంబేలెత్తిపోతున్నారు. అడుగడుగునా రోడ్డు ధ్వంసమవడంతో తలుపులమ్మ అమ్మవారిని దర్శించేందుకు వచ్చే భక్తులకు ప్రమాదం పొంచి ఉంది. 16వ నంబరు జాతీయ రహదారి నుంచి లోవ ఆర్చిగేటు వద్దకు ఉండే నాలుగు కిలో మీటర్ల రహదారి ఉంటుంది. చినుకు పడితే నాలుగైదు రోజులు బురదతో చిత్తడిగా తయారవుతుంది. తాళ్లూరు జంక్షన్ సమపాన, వి.కొత్తూరు కాలనీవద్ద, లోకొత్తూరు చెరువు గట్టుపై, జగన్నాధగిరి కాలనీ తదితర ప్రాంతాలతో రహదారి చిద్రమయ్యింది. భక్తులు, వాహనాదారులను తలుపులమ్మ తల్లే కాపాడుతుందన్న నమ్మకంతో లోవ దేవస్థానాకి వెళ్తున్నారు. ఈ నెల 26 నుంచి జూలై 24 వరకు లోవ దేవస్థానంలో ఆషాఢ మాసోత్సవాలు జరుగుతుండడంతో లక్షలాది మంది భక్తులు ఈ రోడ్డుమార్గన ప్రయాణించనున్నారు. ముందస్తు చర్యలుగా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

ఆపరేషన్ సింధూర్ సైనికుడుకి సత్కారం


సైనికుడు జాఫర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

జగ్గంపేట: జగ్గంపేటలోని వాసవి, వనితా క్లబ్స్ ఆధ్వర్యంలో ఆదివారం సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకూ స్వచ్ఛంద సేవలు అనే కార్యక్రమం నిర్వహించారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ రేణుకుంట్ల శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆపరేషన్ సింధూర్‌లో పాల్గొన్న సైనికుడు జాఫర్ అతని కుటుంబ సభ్యులను సత్కరించారు. ఉదయం గోశాలలో గరుకు స్తంభం ప్రతిష్ఠ నిర్వహణ, సిమ్మెంట్ బెంచీలు ప్రారంభోత్సవం, ఆపరేషన్ , చెప్పులు కుట్టే పేదలకు నిత్యావసర వస్తువులు పంపిణీ, మానసిక వికలాంగులకు నీపిడ్ కిట్ పంపిణీ, స్కూల్ విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం ఆఫీసర్ మానేపల్లి బంగారాజు, రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరక్టర్ కొత్త కొండబాబు, వనిత క్లబ్ సెక్రటరీ మాతంశెట్టి లావణ్య, కోశాధికారి నాగలక్ష్మి, వాసవిక్లబ్, అధ్యక్షుడు మానేపల్లి రామానుజ, వాసవి క్లబ్ బిటెక్, ఆర్య వైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో మెరిసిన ఆదర్శ విద్యార్థులు


పెయ్యాల రాజేశ్వరి


గానుగుల సంతోష్‌కుమార్


అత్తిలి ధనలక్ష్మి

గోకవరం: దేశవ్యాప్తంగా జరిగిన జాయింట్ ఎంట్రానస్ ఎగ్జామినేషన్ (జేఈఈ) ప్రవేశ పరీక్ష ఫలితాల్లో గోకవరం మండలం కొత్తపల్లి ఆదర్శ ఫార్మసీ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు జాతీయస్థాయిలో ర్యాంకులు సాధించారు. బి ఫార్మసీ విద్యార్థులు పెయ్యాల రాజేశ్వరి 2,225వ ర్యాంకు, గానుగుల సంతోష్ కుమార్ 3,704వ ర్యాంకు, అత్తిలి ధనలక్ష్మి 4,334వ ర్యాంకులు సాధించినట్టు కళాశాల చైర్మన్ పి.కనకరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సెక్రటరీ పి.నాగలక్ష్మీ, ప్రిన్సిపల్ డాక్టర్ త్రినాధరావు, కోఆర్డినేటర్ శ్రీనివాస్‌రావు అభినందించారు.

ముగిసిన శిక్షణ తరగతులు

బోట్‌క్లబ్: విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలకు స్థానిక ఆర్ఎస్ఎస్ కార్యాలయంలో గత రెండు రోజులుగా నిర్వహించిన శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. పరిషత్ జిల్లా అధ్యక్షుడు ఆర్.రవిశంకర్ పట్నాయక్ కార్యకర్తలు నిర్మాణం, వ్యక్తిగత శీల నిర్మాణం, వార్షిక యోజన కార్యక్రమాలు, సంస్థాగత నిర్మాణ కార్యకలాపాలు, ప్రఖండ స్థాయి వర్గ నిర్వహణ విషయాలను వివరించారు. అనంతరం శిక్షణ ఇచ్చిన వారి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పరిషత్ ఉత్తరాంధ్ర కార్యదర్శి భూపతి రాజు సుబ్బరాజు, జిల్లా కార్యదర్శి బిక్కిన రాజు పాల్గొన్నారు.

వైభవంగా సత్యదేవుని కల్యాణం


కల్యాణంలో పాల్గొన్న భక్తులు


సత్యదేవుని, అమ్మవార్లకు కల్యాణం నిర్వహిస్తున్న కల్యాణబ్రహ్మ చామర్తి కన్నబాబు, అర్చకుడు రామ్‌కుమార్ తదితరులు

అన్నవరం: సత్యదేవుని నిత్యకల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్ల నిత్య కల్యాణం ఆదివారం అంగరంగవైభవంగా నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకే సత్యదేవుడు, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా నిత్య కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. స్వామి అమ్మవార్లను వెండి సింహాసనం మీద, పక్కనే సీతారాములను వెండి మకరతోరణం అలంకరించిన మరో ఆశనం మీద ప్రతిష్ఠించి పూజలు చేశారు. అనంతరం అర్చకులు కంచిబట్ల రామ్‌కుమార్, వ్రతపురోహిత సంఘం అధ్యక్షుడు, కల్యాణబ్రహ్మ చామర్తి కన్నబాబు ఆధ్వర్యంలో కల్యాణం ఘనంగా నిర్వహించారు. కల్యాణంలో ప్రతీ ఘట్టాన్ని కన్నబాబు భక్తులకు వివరించారు. వేదపండితులు సంతోష్ ఘనాపాఠీ, గంగాధరబట్ల శర్మ ఘనాపాఠీ స్వామి, అమ్మవార్లకు వేదాశీస్సులు అందచేశారు. 20 జంటలు స్వామివారి నిత్యకల్యాణంలో పాల్గొన్నాయి.

భక్తిశ్రద్ధలతో గంగాలమ్మ గావు సంబరం


కత్తిపూడిలో గంగాలమ్మ గావులో తప్పెటగుళ్లు ఆడుతున్న కళాకారులు

శంఖవరం: మండలంలోని కత్తిపూడిలో వేంచేసియున్న గంగాలమ్మ అమ్మవారి జాతర మహోత్స వేడుకలు రెండు రోజు ఘనంగా కొనసాగింది. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివెళ్లి పూలు, పండ్లు, పసుపు, కుంకుమలతో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయాన్ని పూల దండలు, విద్యుత్ దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు. సాంస్కృతిక కార్యక్రమం తప్పెట్లగుళ్ల ఆటలు ఆడి జాతరను వైభవంగా నిర్వహించారు. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. అమ్మవారి ప్రతిమగా కొలిచే బుట్టకు ప్రత్యేక పూజలు చేశారు.

15 మంది జూదరుల అరెస్ట్

తొండంగి: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం పేకాట నిర్వహిస్తుండగా పోలీసులు దాడిచేసి 15 మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ 46,300 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై బి.జగన్మోహన్‌రావు తెలిపిన వివరాల ప్రకారం స్థానికుల నుంచి అందిన సమాచారం మేరకు పి.ఇ.చిన్నాయపాలెంలో నిర్వహించిన దాడిలో ఆరుగురిని అరెస్టు చేసి నిందితుల వద్ద రూ.6,600 నగదునూ స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం పి.అగ్రహారంలో ఐదుగురిని అరెస్టు చేసి రూ.7,850, కడారిపేటలో నలుగురుని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ31,980 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడుల్లో మొత్తం 15 మందిని అరెస్టు చేయగా వారి వద్ద నుంచి రూ.46,300 నగదును సీజ్ చేశామన్నారు. దీనిపై కేసు నమోదు చేశామని ఆయన పేర్కొన్నారు. చట్టవ్యతిరేక పనులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

800 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రత్తిపాడు: మండలంలోని వంతాడ గిరిజన తండాలో ఆదివారం ప్రత్తిపాడు ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. స్థానిక ఎక్సైజ్ సీఐ పి. శివ ప్రసాద్ కథనం మేరకు నాగులకొండపై గల వంతాడ గిరిజన గ్రామ పరిధిలోని నాటు సారా స్థావరాలపై దాడులు నిర్వహించి, సారా తయారీకి సిద్ధం చేసిన 800 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. చట్టవ్యతిరేక పనులకు పాల్పడితే తీవ్రమైన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్సై పున్నం వంశీరామ్ తదితర సిబ్బంది పాల్గొన్నారని స్థానిక ఎక్సైజ్ సీఐ తెలిపారు.

బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి


అగ్నిప్రమాద బాధితులను పరామర్శించి అధికారులతో మాట్లాడుతున్న వంగా గీత

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత

పిఠాపురం: ప్రమాదవశాత్తు ఇల్లు అగ్నికి ఆహుతయ్యి నిరాశ్రయులైన బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత కోరారు. పిఠాపురం మండలం నవఖండ్రవాడలో ఆదివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిన అగ్ని ప్రమాదంలో సిద్ధాంతపు బాబులు, సిద్ధాంతపు భగవాన్‌దాస్ లకు చెందిన పూరిల్లు దగ్ధమయ్యి కుటుంబ సభ్యులు కట్టుబట్టలతో రోడ్డున పడింది. విషయం తెలుసుకున్న ఆమె సంఘటన స్థలానికి చేరుకుని అగ్నిప్రమాద బాధితులను పరామర్శించారు. ప్రమాదానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచే అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ప్రమాద బారిన పడిన కుటుంబాన్ని ఆదుకోడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబానికి భరోసా కల్పించిన ఆమె పార్టీ తరుపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆమె వెంట వైఎస్సార్ సీపీ నేతలు పలువురు ఉన్నారు.